క్లుప్తంగా

నియామకం

పలిమెల: సీపీఎం మండల కార్యదర్శిగా సూదుల శంకర్ ఎన్నికయ్యారు. మండల కేంద్రంలో నిర్వహించిన సీపీఎం మండల ప్రథమ మహాసభల్లో పార్టీ జిల్లా కార్యదర్శి బందు సాయిలు ఆధ్వర్యంలో నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల సోషల్ మీడియా బాధ్యులుగా పెద్ది శేఖర్, మండల కమిటీ సభ్యులుగా పాగే పొట్టయ, అనపర్తి బాలక్క, గుమ్మడి భీమయ్య, మూసాకి భిలంద్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సూదుల శంకర్ మాట్లాడుతూ.. మండల కార్యదర్శిగా తనను ఎన్నుకున్న మండల కమిటీ సభ్యులకు, ఎన్నికకు సహకరించిన జిల్లా కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు.

ఓటురుగా నమోదు చేసుకోవాలి

పలిమెల: వరంగల్, నల్గొండ, ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటు హక్కు కోసం అర్హులైన ఉపాధ్యాయులు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ సయ్యద్ సర్వర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అక్టోబర్ 1 నుంచి నవంబర్ 6వ వరకు ఓటరు నమోదు, నవంబర్ 23 వరకు ముసాయిదా ఓటరు జాబితా ప్రదర్శన, నవంబర్ 23 నుంచి డిసెంబర్ 9 వరకు జాబితాపై అభ్యంతరాల స్వీకరణ, డిసెంబర్ 30న తుది ఓటరు జాబితా ప్రచురణ ఉంటుందని పేర్కొన్నారు.

విద్యుత్‌షాక్‌తో యువకుడి మృతి

భూపాలపల్లి అర్బన్: విద్యుత్‌షాక్‌తో ఒకరు మృతి చెందిన సంఘటన మున్సిపాలిటీ పరిధిలోని కాశీంపల్లి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. చల్లూరి రంజిత్ (25) ఇంటి ఆవరణంలో తాగునీటి సంపులోని మోటార్ పని చేయడం లేని మరమ్మతు చేస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో షాక్ గురి కాగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, అక్కడి నుంచి ఎంజీఎంకు తరలిస్తున్న క్రమంలో మార్గంలో చనిపోయినట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



రేగొండ: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారిని హిమబిందు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రేగొండ జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు జీవశాస్త్ర ఉపాధ్యాయుడు రాధాకృష్ణ ఆధ్వర్యంలో సందర్శించారు. మండల వైద్యాధికారిని హిమబిందూ ఆస్పత్రి పని తీరును, సౌకర్యాలను విద్యార్థులకు వివరించారు. ఇన్‌వార్డు, లేబర్‌రూమ్, ఫార్మసి, లాబరేటరి, వ్యాక్సినేషన్ స్టోరేజ్ విభాగాలను విద్యార్థులు సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. దోమల ద్వారా సంక్రమించే వ్యాధులు, నివారణ చర్యల గురించి వివరించారు.

కఠినంగా శిక్షించాలి

కాళేశ్వరం: మంత్రి కొండసురేఖపై సోషల్ మీడియాలో ట్రోల్ చేస్తున్న వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని పద్మశాలి సంఘం జాతీయ నాయకుడు పంతకాని శ్రీనివాస్ నేత డిమాండ్ చేశారు. మహదేవపూర్ మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరులు సమావేశంలో ఆయన మాట్లాడారు. మెదక్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రిగా ఉన్న కొండ సురేఖ పర్యటనకు వెళ్లిన సందర్భంలో మెదక్ బీజేపీ ఎంపీ రఘునందన్ రావు నూలుతో నేసిన దండను మంత్రి మెడలో వేసి చేనేత కార్మికుల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఈ వీడియోను బీఆర్ఎస్‌కు చెందిన సోషల్ మీడియాలో ట్రోలింగ్ చేస్తున్నారని అన్నారు. సోషల్ మీడియాలో ట్రోల్ చేసిన వారిని గుర్తించి దీని వెనుక ఉన్న అదృష్ట శక్తులను కూడా గుర్తించి కఠినంగా శిక్షించి భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు జరగకుండా చూడాలని అధికారులను కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

భూపాలపల్లి రూరల్: 2024–25 సంవత్సరానికి జిల్లాలోని అర్హులైన షెడ్యూల్డు కులాల విద్యార్థులు పోస్ట్‌మెట్రిక్ ఉపకార వేతనానికి, నూతన మార్గదర్శకాల ప్రకారం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్ కులముల అభివృద్ధి అధికారి సునీత మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తు ప్రక్రియ 3 దశలలో ఉంటుందని తెలిపారు. కళాశాల యాజమాన్యాలు విద్యార్థులకు తగు సూచనలు చేసి రిజిస్ట్రేషన్ చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

చికెన్ సెంటర్ ధ్వంసం

కాటారం: దేవరాంపల్లి బస్టాండ్ సమీపంలో ఓ చికెన్ సెంటర్‌ను సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. చికెన్ సెంటర్ సామగ్రితో పాటు కోళ్లకు సంబంధించిన జాలీల ధ్వంసానికి పాల్పడ్డారు. సదరు చికెన్ సెంటర్ యజమాని కొందరికి చిట్టి డబ్బులు ఇవ్వాల్సి ఉండగా.. వారే ఈ ఘటనకు పాల్పడి ఉంటారని పలువురు చర్చించుకుంటున్నారు.

అలంకారప్రాయంగా సెగ్రిగేషన్ షెడ్లు

- వినియోగంలోకి తీసుకురాని వైనం
- ప్రజాధనం దుర్వినియోగం



సోమనపల్లిలో అలంకార ప్రాయంగా ఉన్న సెగ్రిగేషన్ షెడ్డు

టేకుమట్ల: చెత్తను సేకరించి, సంపదను సృష్టించేందుకు గ్రామ పంచాయతీల పరిధిలో గత ప్రభుత్వం మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్డులు నిర్మించిన నాటి నుంచి నేటి వరకు అలంకార ప్రాయంగా దర్శనమిస్తున్నాయి. మండలంలో 24 గ్రామ పంచాయతీలకు గానూ ప్రతీ గ్రామంలో సెగ్రిగేషన్ షెడ్లు నిర్మించగా చలివాగు పరివాహక ప్రాంతంలో నిర్మించిన సుబ్బక్కపల్లి, ఎంపేడు సెగ్రిగేషన్ షెడ్లు భారీ వరదలకు పూర్తిగా ధ్వంసమయ్యాయి. మరికొన్ని చోట్ల శిథిలావస్థకు చేరుకున్నాయి. ఒక్కో షెడ్డుకు రూ.2లక్షల 50వేల నిధులను వెచ్చించి నిర్మించగా ధ్వంసమైన వాటితో పాటు, పాక్షికంగా ధ్వంసమైన వాటికి ఇప్పటి వరకు మరమ్మతులు చేపట్టలేదు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త డంపింగ్

సెగ్రిగేషన్ షెడ్డుల పరిసరాలలోనే డంపింగ్ యార్డులను ఏర్పాటు చేసి, వాటి నుంచి తడి, పొడి చెత్తను వేరు చేసి సంపదను సృష్టించాలనేది సెగ్రిగేషన్ షెడ్డు నిర్మాణ ముఖ్య ఉద్దేశ్యం. కానీ అవగాహన లేమితో సెగ్రిగేషన్ షెడ్డులను వినియోగంలోకి తేకపోవడమే కాకుండా ఇష్టారీతిన బహిరంగ ప్రదేశాల్లో చెత్తను తరలిస్తూ నిప్పు పెట్టి కాల్చేస్తున్నారు. రబ్బర్, ప్లాస్టిక్ వ్యర్థాలను కాల్చడం వల్ల వచ్చే విష వ్యర్థ వాయువులు గాలిలో కలిసి పర్యావరణాన్ని కలుషితం చేస్తున్నాయి. తద్వారా వాతావరణం కలుషితమై శ్వాసకోశ వ్యాధులు ప్రబలే ప్రమాదముందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సెగ్రిగేషన్ షెడ్డులను నిర్మించి ఇప్పటి వరకు సుమారు 4 సంవత్సరాలు గడేస్తున్నా వాటి నుంచి ఇప్పటి వరకు గ్రామ పంచాయతీలకు ఒక్క రూపాయి కూడా జమ కాకపోవడంతో పాటు, అలంకార ప్రాయంగా మారాయి. కావున ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి డంపింగ్‌యార్డులను వినియోగంలోకి తీసుకవచ్చేందుకు సిబ్బందికి సరైన శిక్షణ అందించి సంపద సృష్టించేందుకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



వెలిశాలలో బహిరంగ ప్రదేశంలో పారబోసిన చెత్త

వినియోగంలోకి తేవాలి



పర్యావరణాన్ని కాలుష్యం నుంచి రక్షించేందుకు డంపింగ్‌యార్డులు, సెగ్రిగేషన్ షెడ్డులను వినియోగంలోకి తీసుకురావాలి. గ్రామాల్లో సేకరించిన చెత్తను బహిరంగ ప్రదేశాల్లో కాకుండా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రదేశాల్లోనే డంప్ చేయాలి. అంతే కాకుండా చెత్త నుంచి సంపదను సృష్టించే విధంగా సిబ్బందికి శిక్షణనిస్తే గ్రామ పంచాయతీకి మరింత అదనపు ఆధాయం సమకూరుతుంది. అలాగే చెత్తను కాల్చేయడం నిలిపి వేయాలి.

– గువ్వాడి లక్ష్మణ్, ఆరెపల్లి

ఎరువులను తయారు చేస్తున్నాం..



మండలంలోని అన్ని గ్రామాల్లోని సెగ్రిగేషన్ షెడ్డుల్లో సేంద్రియ ఎరువులను తయారు చేస్తున్నాం. షెడ్డులు నిర్మించిన తర్వాత తయారు చేసిన సేంద్రియ ఎరువును ఢిల్లీకి సైతం పంపించాం. భవిష్యత్‌లో పూర్తి స్థాయిలో సేంద్రియ ఎరువును తయారు చేస్తాం. వరదలకు ధ్వంసమైన సెగ్రిగేషన్ షెడ్లుకు మరమ్మతులు చేపిస్తాం.

– అనిత, ఎంపీడీఓ, టేకుమట్ల

పరిశుభ్రత ప్రతీ ఒక్కరి బాధ్యత



గణపురం: మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు

- కలెక్టర్ రాహుల్ శర్మ

గణపురం: పరిశుభ్రత ఒక మహోన్నత కార్యక్రమని.. ప్రతీ ఒక్కరు బాధ్యతగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. గణపురం మండలం చెల్పూరు గ్రామంలో మంగళవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రామ పంచాయతీ నుంచి ప్రభుత్వ ఉన్నత పాఠశాల వరకు విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులతో మానవహారం నిర్వహించి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛత, పరిశుభ్రత, పచ్చదనం నిరంతరాయంగా కొనసాగాలని అన్నారు. ప్రతి విద్యార్థి అమ్మ పేరు మీద ఒక మొక్కను నాటాలన్నారు. ఈ అవగాహన ర్యాలీలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీపీఓ నారాయణరావు, డీఆర్‌డీఓ అవినాష్, ఎంపీడీఓ భాస్కర్ పాల్గొన్నారు.

ప్రాసెసింగ్ యూనిట్‌ను పునఃప్రారంభించాలి

చెల్పూరు గ్రామంలో మహిళా గ్రామ సమాఖ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మిల్లెట్(చిరుధాన్యాల)ప్రాసెసింగ్ యూనిట్‌ను పునః ప్రారంభించాలని కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. మంగళవారం యూనిట్‌ను ఆయన సందర్శించారు. యంత్రాలను పరిశీలించి చిరుధాన్యాలతో తయారుచేసిన ఆహారాన్ని రుచిచూసి బాగుందని నిర్వాహకులను అభినందించారు. ఆహార వస్తువులను జిల్లాలోని ప్రభుత్వ వసతి గృహాలు, మహిళా శక్తి క్యాంటీన్లకు సరఫరా చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీపీఓ నారాయణరావు, డీఆర్‌డీఓ అవినాష్, డీపీఎం రవి, ఎస్పీఎం కోఆర్డినేటర్లు వెంకటేష్, భాస్కర్ పాల్గొన్నారు.



గణపురం: ఆహారం రుచి చూస్తున్న కలెక్టర్ రాహుల్ శర్మ

ప్రత్యేకాధికారులు పర్యవేక్షించాలి

భూపాలపల్లి: ఫ్యామిలీ డిజిటల్ కార్డు జారీకోసం జిల్లాలోని నియోజకవర్గ ప్రత్యేకాధికారులు పర్యవేక్షించాలని కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. వివిధ ప్రభుత్వ కార్యక్రమాల అమలుపై మంగళవారం హైదరాబాద్ నుంచి మంత్రి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఇతర ఉన్నతాధికారులతో కలిసి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి, సీఎం పలు సూచనలు చేశారు. అనంతరం కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులతో మాట్లాడారు. అసెంబ్లీ నియోజకవర్గంలో కేటాయించిన బృందాలకు అవసరమైన అవగాహన కల్పించాలని అన్నారు. ప్రతీ రోజు ఇళ్ల లక్ష్యాలను కేటాయించి ఉదయం, సాయంత్రం టీముల పనితీరుని పర్యవేక్షించాలని ఆదేశించారు. ఇంటింటికీ తిరిగి ఆఫ్‌లైన్‌లో పూర్తి వివరాలు సేకరించి సర్వే చేపట్టాలని చెప్పారు. దీనికి తగిన విధంగా అవసరమైన బందాలను ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



కాటారం: అవగాహన కల్పిస్తున్న డాక్టర్ మౌనిక



కాళేశ్వరం: రక్తదానం చేస్తామని ప్రతిజ్ఞ సిబ్బంది

కాటారం: రక్తదానం చేయడం ద్వారా ప్రాణాపాయ స్థితిలో ఉన్న మరొకరి ప్రాణం నిలబడుతుందని మండల వైద్యాధికారిని మౌనిక అన్నారు. నేషనల్ వలంటరీ బ్లడ్ డొనేషన్ డేను పురస్కరించుకొని మండలంలోని పలు గ్రామాల్లో రక్తదానంపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మౌనిక మాట్లాడుతూ.. అన్ని దానాల్లోకెల్లా రక్తదానం మహా గొప్పదని ప్రతి ఒక్కరూ సమయం వచ్చినప్పుడు రక్తదానం చేయాలని సూచించారు. రక్తదానంపై ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని దాని వల్ల ఎలాంటి హాని ఉండదని పేర్కొన్నారు. రక్తదానం చేయడం ద్వారా శరీరంలో రక్తం రిఫ్రెష్ అవుతుందన్నారు. అనంతరం వైద్యులు, వైద్య సిబ్బంది, ప్రజలతో కలిసి రక్తదానం ప్రతిజ్ఞ చేశారు.

బయ్యారంలో వైద్యశిబిరం

మండలంలోని బయ్యారంలో మంగళవారం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి పలు వ్యాధులతో బాధపడుతున్న వారికి మందులు పంపిణీ చేశారు. వైద్యులు తిరుపతిరెడ్డి, గీత, ప్రియాంక, హెచ్ఈఓ తిరుపతి, హెల్త్ అసిస్టెంట్ సమ్మయ్య, ఏఎన్ఎంలు లక్ష్మి, రజిత పాల్గొన్నారు.

కాళేశ్వరం: రక్తదానం ప్రాణదానంతో సమానమని డాక్టర్ సుస్మిత అన్నారు. జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం 2024 పురస్కరించుకొని కాళేశ్వరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ సుస్మిత, వైద్య సిబ్బంది రక్తదానం చేస్తామని మంగళవారం ప్రతిజ్ఞ చేశారు. రక్తాన్ని క్రమం తప్పకుండా దానం చేస్తానని డాక్టర్, సిబ్బంది అన్నారు.

జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక

మొగుళ్లపల్లి: కరీంనగర్ జిల్లాలోని కురిక్యాల గ్రామంలోని ఎస్సార్ ప్రైమ్ స్కూల్ ఆవరణలో సెప్టెంబర్ 18న షూటింగ్ బాల్ సబ్ జూనియర్ బాలబాలికల రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. కాగా, మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలోని ముగ్గురు విద్యార్థులు పాల్గొనగా శివాజీ, వినయ్ ఇద్దరూ విద్యార్థులు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి జాతీయస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయ్‌పాల్ రెడ్డి, పీడీ గుండెల్లి రాజయ్య తెలిపారు. ఎంపికైన విద్యార్థులను మంగళవారం పాఠశాలలో ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నవంబర్ 2న బీహార్ లోని గయాలో నిర్వహించనున్న జాతీయస్థాయి క్రీడలలో తెలంగాణ జట్టు తరపున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఉపాధ్యాయులు, భాగ్యశ్రీ, వెంకన్న, సురేందర్, కల్యాణి, అనిల్ కుమార్, రాజు, కుమారస్వామి, ప్రవీణ్ లలిత, పద్మ, విజయ భాస్కర్ ,చందర్ అటెండర్ మజార్ పాల్గొన్నారు.



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఓటు నమోదుపై విస్తృత ప్రచారం

కాటారం: కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్, నిజామాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా పట్టభద్రులంతా ఓటరు నమోదుచేసుకోవాలని తెలంగాణ మెడికల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ బండారి రాజ్‌కుమార్ కోరారు. మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల నూతనంగా గ్రాడ్యుయేట్స్ ఫోరం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఫోరానికి సంబంధించి నాలుగు జిల్లాల్లో 42 నియోజకవర్గాల్లో 42మంది కోర్డినేటర్లు నియమించి ఓటర్ నమోదుపై విస్తృత ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో టిజిఎఫ్ మంథని కోఆర్డినేటర్ పప్పుల శ్యాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాజ్‌కుమార్

దేశాభివృద్ధికి తీరని నష్టం

భూపాలపల్లి అర్బన్: కేంద్రం ప్రభుత్వం అవలంబిస్తున్న మతోన్మాద ప్రజావ్యతిరేక విధానాల వలన ప్రజా ప్రయోజనాలకు, దేశ అభివృద్ధికి తీరని నష్ట కలుగుతుందని సీపీఎం జిలా కార్యదర్శి బందు సాయిలు ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం పట్టణ పార్టీ జోన్స్ ప్రథమ మహాసభలు నిర్వహించారు. జిల్లా కమిటీ సభ్యులు వెలిశెట్టి రాజయ్య జెండా ఆవిష్కరణ చేయగా బందు సాయిలు హాజరై మాట్లాడారు. బీజేపీ మతోన్మాద ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలన్నారు. దళితులు, ఆదివాసీలు, కార్మికులు, పేద ప్రజలపై దాడులు దౌర్జన్యాలను ప్రేరేపిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమేష్, శేఖర్, మహేందర్, నరేష్, రవికుమార్, రజాక్, భిక్షపతి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సాయిలు

పాఠశాలల్లో బతుకమ్మ సంబురాలు

జిల్లా వ్యాప్తంగా మంగళవారం ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో ముందస్తు బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. విద్యార్థినులు రంగురంగుల పూలతో ఆకట్టుకునే బతుకమ్మలు తయారు చేశారు. బతుకమ్మ పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. ఉపాధ్యాయులు బతుకమ్మ పండగ విశిష్టత, ప్రాముఖ్యతను గూర్చి విద్యార్థులకు వివరించారు.

– సాక్షి నెట్‌వర్క్



చిట్యాల ఉన్నత పాఠశాలలో బతుకమ్మలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు



కాళేశ్వరం: జెడ్పీహెచ్ఎస్‌లో..



భూపాలపల్లి అర్బన్: రావణాసురవధ చేస్తున్న ఉపాధ్యాయులు



కొత్తపల్లిగోరిలో..



కాటారం: చింతకాని ప్రభుత్వ పాఠశాలలో..



కాళేశ్వరం: కళాశాలలో బతుకమ్మలతో విద్యార్థులు, అధ్యాపకులు



టేకుమట్ల జిల్లా పరిషత్ పాఠశాలలో..



మొగుళ్లపల్లిలో..



మల్హర్: పెద్దతూండ్లలో..



భూపాలపల్లి అర్బన్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

గ్రామసభలు నిర్వహించాలి

కాటారం: గాంధీ జయంతిని పురస్కరించుకొని మండలంలోని ప్రతీ గ్రామ పంచాయతీలో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించడంతో పాటు గ్రామసభలు నిర్వహించాలని ఎంపీడీఓ బాబు, ఎంపీఓ వీరస్వామి పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉపాధిహామీ ప్లాన్ ఆఫ్ యాక్షన్, స్వచ్ఛతా హీ సేవ చివరి గ్రామసభ, ఈ పంచాయతీ నిర్వహణ, బతుకమ్మ ఏర్పాట్లపై చర్చించారు. బతుకమ్మ సంబురాల్లో మహిళలకు ఎలాంటి అసౌకర్యాలు కల్గకుండా చూసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ వెంకన్న, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

చిట్యాల: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని జిల్లా కన్వీనర్ జన్నె మొగిలి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు బుర్ర వెంకటేశ్ గౌడ్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కన్వీనర్ జన్నె మొగిలి హాజరై మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామాల్లో బీజేపీ సభ్యత్వ నమోదు ఎక్కువ సంఖ్యలో చేయాలని పేర్కొన్నారు. మండల ఉపాధ్యక్షుడు గజనాల రవీందర్, నాయకులు శ్రీకాంత్, ప్రభాకర్, రాజేందర్, సంపత్ పాల్గొన్నారు.

మొగుళ్లపల్లి: పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మండలంలో వేగవంతం చేయాలని బీజేపీ జిల్లా సభ్యత్వ కన్వీనర్ జన్నే మొగిలి అన్నారు. మంగళవారం మండలంలోని మొగుళ్లపల్లి, రంగాపురం గ్రామాల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కష్టపడి పనిచేయాలని కార్యకర్తలకు సూచించారు. బీజేపీ మండల అధ్యక్షుడు చెవ్వ శేషగిరి, రాష్ట్ర నాయకులు రాంచంద్రారెడ్డి, రాజయ్య, సాయిలు, వెంకట్‌రెడ్డి, రాజయ్య, శ్రీధర్, రాజేశం, నరసయ్య పాల్గొన్నారు.



చిట్యాల: మాట్లాడుతున్న జన్నె మొగిలి

స్వచ్ఛ భారత్



స్వచ్ఛ భారత్ నిర్వహిస్తున్న నాయకులు

భూపాలపల్లి రూరల్: అక్టోబర్ 2 గాంధీజయంతిని పురష్కరించుకొని ముందస్తుగా మంగళవారం బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సయ్యద్ గాలిఫ్ ఆధ్వర్యంలో బీజేవైఎం, బీజేపీ నాయకులు భూపాలపల్లి పట్టణంలోని సుభాష్ కాలనీలో గాంధీ విగ్రహంవద్ద స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధి బట్టు రవి, బీజేపీ పట్టణ అధ్యక్షుడు సామల మధుసూదన్ రెడ్డి, దొంగల రాజేందర్, పట్టణ ప్రధాన కార్యదర్శి తుమ్మేటి రామిరెడ్డి, భాస్కర్, నారాయణ, రమేశ్, బీజేవైఎం నాయకులు తిరుపతి, శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.